క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి అండ



సాయం అందిస్తున్న మిత్రులు

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసే గైని రాందాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనతోపాటు బెల్లంపల్లి గురుకుల పాఠశాలలో చదువుకున్న మిత్ర బృందం శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు పోగు చేసిన రూ.43,500లను రాందాస్ కుటుంబసభ్యులకు అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సరుకులు అందజేత

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో కడమంచి రాజవ్వ అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మాజీ మంత్రి ఐకే రెడ్డి పీఏ ఒడ్డెపల్లి కృష్ణంరాజు బాధిత కుటుంబానికి ఓకే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.ఐదు వేల విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నామెడ ధర్మరాజు రూ.రెండు వేల ఆర్థికసాయం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

భైంసారూరల్: అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని పేండ్‌పెల్లి సమీపంలో ఒకటి, మాటేగాం సమీపంలో మరొకటి పట్టుకున్నట్లు భైంసారూరల్ సీఐ నైలు పేర్కొన్నారు. సదరు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. వాగుల్లోంచి ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి



సర్వే వివరాలు తెలుసుకుంటున్న చైర్మన్

ఖానాపూర్: డిజిటల్ ఆరోగ్య కార్డుల జారీలో భాగంగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టు సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో జెడ్పీ సీఈవో గోవింద్‌తో కలిసి సర్వేలో పాల్గొన్నారు. జన్నారపు శంకర్, పరిమి సురేశ్, తొంటి శ్రీనివాస్, దయానంద్, రమేశ్, రాజేందర్, శేషాద్రి తదితరులున్నారు.

మెరిట్ జాబితా ప్రదర్శన

సారంగపూర్: మండలంలోని జామ్ కేజీబీవీలో ఖాళీగా ఉన్న అటెండర్, సహాయ వంట మనిషి పోస్టుల మెరిట్‌లిస్టును శనివారం విడుదల చేశామని ఎంఈఓ మధుసూదన్ తెలిపారు. మెరిట్ జాబితాను పరిశీలించిన తర్వాత నాన్‌టీచింగ్ అభ్యర్థులు తమ అభ్యంతరాలను సోమవారంలోగా తెలియజేయాలని సూచించారు. సోమవారం ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాను ఆమోదం కోసం కమిటీ సభ్యులు అయిన తహసీల్దార్, ఎంపీడీఓలకు అందజేస్తామని పేర్కొన్నారు.

బోనమెత్తిన భక్తులు



బోనాలతో వస్తున్న మహిళలు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో దుర్గాదేవి అన్నపూర్ణదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మ భవానీ కమిటీ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు బోనాలు ఎత్తుకొని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భవానీ గురుస్వామి పంతులు ఆచార్య రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన సురేందర్‌కు రూ.13,500, గాయత్రికి రూ.33వేలు, వెంకట్‌రావుకు రూ.13,500, కండెల సౌందర్యకు రూ.11వేలు, నర్మదాకు రూ.21వేలు, పెంటన్నకు రూ.51వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. శనివారం భైంసాలోని తన నివాసంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగే భోజన్న, సత్యం, గంగాధర్ తదితరులు ఉన్నారు.

సేటు చెప్పిందే రేటు..!

- ప్రారంభం కాని మక్కల కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్న రైతులు
- లాభపడుతున్న దళారులు
- ప్రభుత్వమే కొనాలంటున్న కర్షకులు



లోకేశ్వరంలో ఎండబెట్టిన కంకులు



నగర్‌తండా సమీపంలో రోడ్డుపై మక్కలు ఆరబెడుతున్న రైతు

లోకేశ్వరం: మొక్కజొన్న పంట చేతికొస్తున్నా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో కొందరు రైతులు తమ పంటను తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేసరికి తమ పంట దళారులకు చేరుతుందని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రైవేటు వ్యాపారులు రోజురోజుకూ ధర తగ్గిస్తున్నారని.. ప్రభుత్వమే మద్దతు ధర అందించి తమ పంటను కొనాలని రైతులు వేడుకుంటున్నారు.

ప్రారంభమైన పంటకోతలు..

ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికొచ్చింది. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల్లో మక్క కోతలు ప్రారంభమయ్యాయి. లోకేశ్వరం మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. కొన్ని చోట్ల రోహిణికార్తె నుంచే విత్తనాలు విత్తడం ప్రారంభించగా నెలరోజుల కిందటే పంట చేతికి వచ్చింది. దీంతో కొందరు నూర్పిడి చేసి విక్రయించారు. మరికొందరు మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలి వర్షాలతో ఆరబెట్టిన పంటతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

వ్యాపారుల మాయ..

ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులకు తమ పంటను అమ్ముకుంటున్నారు. పంటను నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లే స్తోమత లేకపోవడంతో స్థానిక వ్యాపారులకే విక్రయిస్తున్నారు. 20 రోజుల కిందట క్వింటాల్‌కు రూ.2750 చెల్లించి కొన్న వ్యాపారులు.. ప్రస్తుతం రూ.2,350వరకే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పంటను కొంటున్నారు.

రోజురోజుకూ తగ్గుతున్న ధరలు..

రోజురోజుకూ మక్కలధర తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్లుగా మద్దతు ధరకు మించి అమ్ముడైన పంట ఈసారి తక్కువ ధర పలుకుతోంది. గడిచిన వారం రోజుల్లోనే క్వింటాలుకు రూ.250 వరకు తగ్గింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు.. తక్కువ ధరకు పంటను విక్రయిస్తూ నష్టపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు నివేదించాం. వారి నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి పంట కొంటాం.

– గణేశ్, ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి

తక్కువకు అమ్ముకుంటున్నాం



పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకుందామంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్నాం.

– గంజాయి రమేశ్, మొహాళ

కేంద్రాలు ఏర్పాటు చేయండి



మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పంట చేతికొచ్చి రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఊసెత్తడం లేదు. రైతుల కష్టాలను గుర్తించి వెంటనే కొనుగోల కేంద్రాలను ప్రారంభించాలి.

– సాయన్న, పిప్రి

చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ



వేడుకల్లో చాణక్య కళాశాల విద్యార్థినులు



నిర్మల్‌లోని దీక్ష డిగ్రీ కళాశాలలో..



తానూరులో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



ఖానాపూర్ ప్రభుత్వ కళాశాలలో..



కుంటాల : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



కుభీర్‌లో..

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని చాణిక్య డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపిన నైవేద్యాన్ని గౌరమ్మకు సమర్పించారు. ప్రిన్సిపాల్ బద్రి ప్రవీణ్‌కుమార్, కరస్పాండెంట్ నర్సారెడ్డి, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, నర్సయ్య, గంగాధర్, సోమేశ్వర్, శ్రీనివాస్, రంజిత, రాజు, దేవిదాస్, శివకుమార్, వంశీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దీక్ష, చాణక్య డిగ్రీ కళాశాలల్లో శనివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. దీక్ష కళాశాల డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, ప్రమోద్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీధర్, చాణిక్య కళాశాల కరస్పాండెంట్ నర్సారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో విద్యార్థినులు పూలపండుగ జరుపుకున్నారు. ప్రిన్సిపాళ్లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, డైరెక్టర్లు జానకీరాం, హరిప్రసాద్ పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని తపస్వీ, వివేకానంద డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినులు శనివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. అనంతరం సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. అధ్యాపకులు రవి, సంధ్యారాణి, శ్రీకాంత్, శ్రీనివాస్, యోగేశ్, దత్తాత్రి, మౌనిక, తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోశ్‌రెడ్డి తదితరులున్నారు.

జయజయహే జగజ్జనని



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో..



సారంగపూర్ : పూజలు నిర్వహిస్తున్న భక్తులు



యాగంలో పాల్గొన్న భక్తులు

లక్ష్మణచాంద: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గాదేవి అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కనకాపూర్, వడ్యాల్ గ్రామాల్లోని దుర్గాదేవి మండపాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గాదేవి మండపాల వద్ద ఉదయం, సాయంత్రం భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. దౌనెల్లితండాలోని దుర్గాదేవి ఆలయంలో దీక్షాపరులు పూజలు చేయగా నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

సారంగపూర్: మండలంలోని చించోలి(బి)లో దుర్గాదేవి మండపం వద్ద బీజేపీ నాయకుడు రాంశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దీక్షాపరులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వానల్‌పాడ్‌లో చండీయాగం

భైంసారూరల్: భైంసా–నిర్మల్ జాతీయ రహదారి ఆనుకుని ఉన్న వానల్‌పాడ్ గ్రామంలోని ఎల్లమ్మ గుట్టపై చింతచెట్టు అడుగుభాగంలో స్వయంభుగా దుర్గమ్మ వెలిసిన నాటి నుంచి భక్తుల రద్దీ కొనసాగుతుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వాహకులు చండీయాగం నిర్వహించారు. చింత చెట్టు దుర్గమ్మను దర్శించుకునేందుకు మహారాష్ట్ర, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు. వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ తరఫున ఏర్పాట్లు, అన్నదానం చేశారు.

పారిశుధ్య నిర్మూలనపై దృష్టి సారించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీవో, సిబ్బంది

ఖానాపూర్: వర్షాకాలంలో పెరిగిన పిచ్చిమొక్కలను మొక్కలను తొలగించి పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీవో రత్నాకర్‌రావు పంచాయతీ సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని గోసంపల్లెలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి



శిక్షణ పత్రాలు అందిస్తున్న అధికారులు

మామడ: గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా మంచినీటి సహాయకులు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఎస్ఈ సురేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఎస్ఈ పాల్గొన్నారు. అనంతరం సహాయకులకు శిక్షణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, ఎంపీఓ అమీర్‌ఖాన్, ఏఈలు క్రాంతికుమార్, అభినవ్ పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలపై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ)లో శనివారం టీజీబీ వడ్యాల్‌శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు రుణాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఎంబీ విలాస్, బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ పాదుపు, బ్యాంకుసేవలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, అకౌంటెంట్ శశికుమార్, వీడీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, పడిగెల లక్ష్మణ్, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

భైంసాటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి పడిపెల్లి గంగాధర్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఓటరు నమోదు పరిశీలించారు. మండల ఇన్‌చార్జులు మండలాల్లో అధిక సంఖ్యలో ఓటరు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అసెంబ్లీ ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జి సుమన్, జక్కుల గజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్డా, నారాయణరెడ్డి, పార్లమెంట్ ప్రభారి భూమయ్య, తదితరులున్నారు.

కుంటాల: మండలంలోని పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2021కి ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు తహసీల్దార్ కార్యాలయంలో నవంబర్ 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నర్సాపూర్(జి): ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేశామని.. పట్టభద్రులు ఫారం–18, టీచర్లు ఫారం–19 ద్వారా దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

వెంకటస్వామికి ఘన నివాళి



కుంటాలలో నివాళులర్పిస్తున్న అధికారులు



మామడలో నివాళులర్పిస్తున్న అధికారులు

కుంటాల/తానూరు/మామడ/సోన్/లక్ష్మణచాంద: తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కేంద్రమంత్రి జి.వెంకటస్వామి జయంతిని శనివారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుంటాలలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం, ఆర్ఐలు అడెల్లు, రాజేశ్వర్ =పాల్గొన్నారు. తానూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో తహసీల్దార్ లింగంమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ లచ్చరాం, సిబ్బందిపాల్గొన్నారు. మామడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శివాజీ పాల్గొన్నారు.

సోన్ తహసీల్దార్ కార్యాలయంలో వెంకటస్వామి (కాకా) జయంతి నిర్వహించారు. ఆర్ఐ షేక్ అల్ మున్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మణచాంద తహసీల్దార్ కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి తహసీల్దార్ జానకి, సిబ్బంది నివాళులర్పించారు.

8 నుంచి 'ఉపాధి' గ్రామసభలు

మామడ: మండలంలోని గ్రామాల్లో ఈనెల 8వ తేదీ నుంచి ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి తెలిపారు. 2025–26లో పనుల ప్రణాళిక, లేబర్ బడ్జెట్ రూపకల్పన వంటి అంశాలను గ్రామసభల్లో అధికారులు చర్చిస్తారన్నారు. ఈనెల 8న కమల్‌కోట్, దిమ్మదుర్తి, ఆరేపల్లి గ్రామాల్లో 14న ఆదర్శనగర్, కప్పన్‌పల్లి, తోటిగూడ గ్రామాల్లో 18న పోతారం, మామడ, బూరుగుపల్లి 23న అనంతపేట్, లింగాపూర్, మొండిగుట్ట 29న బండఖానాపూర్, రాయదారి, తాండ్ర, నవంబర్ 4న నల్దుర్తి, పరిమండల్, వస్తాపూర్, 8న కొరిటికల్, ముందరి తండా, రాశిమెట్ల, 16న న్యూలింగంపల్లి, న్యూసాంగ్వి, కిషన్‌రావుపేట్ 23న వెనుకటి తండా, గాయిద్‌పల్లి 28న పొన్కల్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రత్యేకాధికారి, ఈజీఎస్ టీఏలు, పంచాయతీ కార్యదర్శి, సహజ వనరుల కమిటీ సభ్యులు, ఐకేపీ వీఓలు, రైతులు, కూలీలు హాజరవాలని కోరారు.

గ్రామసభ

ముధోల్: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2023–24తో ఉపాధి పనుల అభివృద్ధిపై సామాజిక తనిఖీ బృందం వివరించారు. పనుల వివరాలను క్షుణ్ణంగా చదివి గ్రామస్తులకు వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్ పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్, ఈజీఎస్ సామాజిక బృందం అధికారులు, ఎఫ్ఏలు, టీఏలు, గ్రామస్తులున్నారు.

నర్సాపూర్(జి) మండలంలో..

నర్సాపూర్(జి): 2025–26లో చేపట్టే పనులు గుర్తింపు ప్రణాళికల తయారీకి మండలంలోని 13 గ్రామాలలో ఈనెల 8వ తేదీ నుంచి నవంబర్ 13 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పుష్పలత, ఇన్‌చార్జి ఏపీఓ జగన్నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి పనుల ఎంపిక, లేబర్ బడ్జెట్ కోసం ప్రణాళికలు తయారు చేయాలని టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు.

లోకేశ్వరం మండలంలో ..

లోకేశ్వరం: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 2025–26 ఆర్థికసంవత్సరంలో చేపట్టే పనుల గుర్తించి ప్రణాళికలు తయారు చేసేందుకు ఈనెల 8 నుంచి నవంబర్ 19వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీవో జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న మన్మద్, గడ్‌చాంద, రాజూర గ్రామాల్లో, 15 నుంచి పోట్‌పల్లి, నగర్, పుస్పూర్, 19న లోకేశ్వరం, పిప్రి, కన్కపూర్, 24న హవర్గ, రాయపూర్‌కాండ్లీ, గొడిసెరా, 29న బిలోలి, బామ్నికే, అబ్దుల్లాపూర్, నవంబరు 4న జోహర్‌పూర్, పంచగుడి, బాగాపూర్, 8న సాథ్‌గాం, ధర్మోర, కిష్టాపూర్, 14న హథ్‌గాం, వట్టోలి, నర్సింహానగర్ తండా, 19న సేవాలాల్‌తండాలో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఉపాధి కూలీలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

ధాన్యం కొనుగోళ్లపై అవగాహన

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి పంచాయతీ కార్యాలయంలో శనివారం ఏఈఓ ఉమమహేశ్వరి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగో లు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తామని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్, రైతులు బండి లింగన్న, ఈలసరం లింగన్న, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో పోటీలు

ఖానాపూర్: వన్యప్రాణి సప్తఃవారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలో శనివారం అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనంపై పలు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వారోత్సవాల్లో బాగంగా ఆదివారం కుమురం భీం చౌరస్తాలో మారథాన్ రన్ చేపడుతున్నామని ఎఫ్ఆర్‌వో కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ మహేశ్, తదితరులు ఉన్నారు.

పెంబి: జాతీయ వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా పెంబి రేంజ్ పరిధిలోని ఇటిక్యాల్ తండాలో విద్యార్థులకు చిత్రలేఖనం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఎఫ్ఆర్‌వో రమేశ్‌రావు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇందులో ఎఫ్ఆర్‌వోలు ప్రతాప్ నాయక్, గీతా, ఎఫ్‌బీవోలు కిరణ్, ఆశీశ్ ఉన్నారు.

తీజ్ ఉత్సవాలు ప్రారంభం

కుంటాల: మండలంలోని అంబకంటితండాలో శనివారం తీజ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. యువతులు చెరువు వద్దకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చి గోధుమనారుకు పోశారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో గోధుమనారుకు పూజలు నిర్వహించనున్నారు.

వైద్యదంపతులకు సన్మానం

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన కవి, కళాకారుడు, వైద్యుడు డాక్టర్ వేణుగోపాలకష్ణ ఇటీవల సామాజిక, వైద్య, కళారంగాల్లో చేస్తున్న సేవలకు గుర్తింపు వివిధ పురస్కారాలు అందుకున్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవార్‌పేట్‌లో వైద్యులు డాక్టర్ వేణుగోపాలకృష్ణ–నీలిమ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అదుముల్ల నరేందర్, కమిటీ సభ్యులు రమేశ్, వినోద్, సంపత్, ఉదయ్‌చంద్ర, విశాల్, అరవింద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గంగనీళ్ల జాతరకు భక్తులు

కుంటాల: అడెల్లి మహాపోచమ్మ ఆభరణాలను గోదావరిలో శుద్ధి చేసేందుకు దిలావర్‌పూర్ మండలంలోని న్యూసాంగ్విలో గంగనీళ్ల జాతర ఆదివారం నిర్వహించనున్నారు. కుంటాల మండలంలోని విఠాపూర్, అందాకూర్, కుంటాల నుంచి భక్తులు శనివారం గంగనీళ్ల జాతరకు తరలివెళ్లారు. కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆభరణాలను శుద్ధి చేసేందుకు భాజా భజంత్రీలతో తరలి వెళ్లగా మహిళలు వీరిని మంగళహారతులతో సాగనంపారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

నిర్మల్‌టౌన్: తమకు వేతనాలు చెల్లించాలని నిర్మల్ మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య చేపట్టిన ఆందోళన శనివారం ఐదో రోజుకు చేరింది. మరోవైపు కార్మికులు విధులు బహిష్కరించడంతో పట్టణంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సై రాహుల్ గైక్వాడ్‌ను యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించారు. సొన్న మహేశ్, జెట్టి రమేశ్, చంటి, సాగర్, ఎ.మహేశ్ ఉన్నారు.